



డీసీసీబీలో కంప్యూటరీకరణ ప్రక్రియలో పాల్గొంటోన్న అధికారులు, సిబ్బంది

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు ఈ వారంలోనే అందుబాటులోకి రానున్నాయి.బ్యాంకుల మాదిరిగా సహకార సంఘాలను డిజిటలైజేషన్ చేసి అక్రమాలకు చెక్ పెట్టాలన్న లక్ష్యంతో వీటిలో సాంకేతిక సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది.ఈ నేపథ్యంలో జిల్లాలోని సింగిల్ విండోల్లో కంప్యూటరీకరణ ప్రక్రియ జోరుగా నడుస్తోంది.అయితే ఈ ప్రక్రియ పూర్తయితే తమ అక్రమాలు బయటపడతాయని కొంతమంది సీఈవోలు ఉద్దేశపూర్వకంగా ఆన్‌లైన్ ప్రక్రియను ఆలస్యం చేసినప్పటికీ ఈ నెల 20వ తేదీ నుంచి జోరందుకుంది.



పీఏసీఎస్‌ల్లో ఆన్‌లైన్ సేవలు

- వడివడిగా సింగిల్‌విండోల కంప్యూటరీకరణ
- వారం రోజులుగా డీసీసీబీలోనే సిబ్బంది మకాం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో 37 సింగిల్ విండో(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం-పీఏసీఎస్)లున్నాయి.1,50,205మంది రైతులు సభ్యులుగా వున్నారు. వీటిలో లావాదేవీలన్నీ రికార్డుల్లో చేతిరాతలతోనే నమోదు చేస్తుండడంతో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి.పలు సింగిల్ విండోల్లో సీఈవోలే లక్షలాది రూపాయలు పక్కదారి పట్టించిన ఘటనలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి.దీంతో సంఘాలు ఏర్పడినప్పటినుంచీ ఈ ఏడాది మార్చి 31వరకు జరిగిన లావాదేవీలన్నింటినీ డేటాకేప్చర్ టూల్ (డీసీటీ) సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్ చేసి అక్టోబరు 2 నుంచి సేవలు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. సర్కారు చెప్పిన గడువుకు సింగిల్ విండోల్లో సగం సభ్యుల వివరాలను సైతం ఆన్‌లైన్ చేయలేకపోయారు. గతంలో సహకార ఎన్నికలకోసం రూ.10 వాటాధనం కట్టించి వేలాదిమందిని ఓటర్లుగా చేర్పించేశారు. సాంకేతికంగా వారంతా సభ్యులే. అయినా వారిలో చాలామంది ఆచూకీ దొరకడంలేదు. వారి ఆధార్ నెంబర్లుంటే గానీ ఆన్‌లైన్ చేయడం కుదరదు. సింగిల్ విండోల ద్వారా ఇచ్చిన రుణాలు, వసూళ్ళకు సంబంధించి రికార్డుల్లో వున్న సమాచారానికి, ఆడిట్ నివేదికల్లో చూపిన లెక్కలకు వ్యత్యాసం ఎక్కువగా కనిపిస్తోంది. ఒక్క శాతానికి మించి తేడా ఉంటే, వాటిని ఆన్‌లైన్ చేయడానికి వీలుండదు. జిల్లాలో 5 నుంచి 10 శాతం వ్యత్యాసం ఉన్న సంఘాలే ఎక్కువగా ఉన్నాయి. కంప్యూటరీకరణ పూర్తయితే తమ అక్రమాలు బయటపడతాయని కొంతమంది సీఈవోలు ఉద్దేశపూర్వకంగా ఆన్‌లైన్ ప్రక్రియను ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

తుది దశలో ఆన్‌లైన్ ప్రక్రియ



సింగిల్ విండోల ఆన్‌లైన్ ప్రక్రియ తుదిదశలో ఉంది. కొన్ని సంఘాల్లో సభ్యుల వివరాలు లభించడం లేదు. ఊళ్ళలో దండోరా వేయించి సమాచారం ఇస్తున్నాం. మండలస్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోల సహకారం తీసుకుంటున్నాం. అందుబాటులో లేనివారి ఖాతాలను తరువాత ఆన్‌లైన్ చేయిస్తాం. ఇంటర్నెట్ సమస్యతో కొంత జాప్యం జరుగుతోంది.ఈ నెలాఖరులోగా వందశాతం కంప్యూటరీకరణ పూర్తిచేస్తాం.

- విద్యాధరి, జాయింట్ కలెక్టర్

చివరిస్థానం నుంచి మూడవ స్థానానికి

కంప్యూటరైజేషన్ త్వరితగతిన చేయాలని సహకారశాఖ రిజిస్ట్రార్ ఆరునెలల క్రితం ఆదేశించినా, ముక్తసరిగా చేస్తుండడంతో చిట్టచివరి స్థానానికి చిత్తూరు చేరుకుంది. దీంతో వారం క్రితం ఆయన అధికారులకు అక్షింతలు వేస్తూ 'సీఎం జిల్లా 12వ స్థానంలో ఉండడమేమిటి? జిల్లా అధికారులు పనిచేస్తున్నారా? నిద్రమత్తులో ఉన్నారా? బాధ్యత విస్మరించిన వారిపై కఠిన చర్యలుంటాయంటూ" చీవాట్లు వేశారు. దాంతో డీసీసీబీ ఇన్‌చార్జి ఆఫీసర్, జేసీ విద్యాధరి ఈనెల 20వ తేది నుంచి ప్రత్యేక చొరవ తీసుకుని రోజుకు రెండు లేదా మూడుసార్లు డీసీసీబీకి వెళ్లడం, గంటల తరబడి ఉంటూ ప్రక్రియను పరిశీలించడం చేస్తున్నారు. రోజూ వీడియో, టెలీ, సెట్ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ మరోవైపు రోజువారి ప్రోగ్రెస్ ఎంత జరుగుతున్నదో తెలుసుకుంటూ అధికారులకు రోజువారీ లక్ష్యాలు పెడుతున్నారు. దీంతో విండోల కంప్యూటరీకరణ ప్రక్రియ తాజాగా మూడో స్థానానికి చేరుకుంది. కంప్యూటరీకరణ కోసం కావాల్సిన సిబ్బందికి అదనంగా సచివాలయ సిబ్బందిని జేసీ కేటాయించారు. అక్కడే అన్ని విండోల నుంచి లెడ్జర్లు, రుణాలు, మెంబర్‌షిప్ (షేర్ క్యాపిటల్) పుస్తకాలు, అప్పుల పుస్తకాలు తెప్పించి కంప్యూటరీకరిస్తున్నారు. దీంతో డీసీవో, డీసీఏవో, డీఎల్‌సీవో, సహకారశాఖ అధికారులు, విండో సిబ్బంది అందరూ రాత్రింబవళ్ళు డీసీసీబీలోనే ఉంటూ ఆన్‌లైన్ ప్రక్రియను కొలిక్కి తెస్తున్నారు. బుధవారం నాటికి 25సింగిల్‌విండోల్లో కంప్యూటరీకరణ పూర్తయింది.మిగిలిన 12సింగిల్‌విండోల్లో కూడా 50శాతం ప్రక్రియ పూర్తి కావొచ్చింది. ఈ నెలాఖరులోగా కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలున్నాయి.



నారావారిపల్లికి సీఎం చంద్రబాబు

వెంట వచ్చిన మంత్రి లోకేశ్ ● నేడు రానున్న నందమూరి కుటుంబం

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు, మంత్రి నారా లోకేశ్‌తో కలసి బుధవారం రాత్రి స్వగ్రామమైన నారావారిపల్లి చేరుకున్నారు. గురువారం జరిగే తన సోదరుడు రామ్మూర్తి నాయుడి కర్మక్రియల్లో పాల్గొనేందుకు బుధవారం సాయంత్రం 6.35 గంటలకు రేణిగుంటలోని విమానాశ్రయానికి వచ్చి రోడ్డు మార్గాన రాత్రి 7.45 గంటలకు నారావారిపల్లి చేరుకున్నారు.ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, కురుగొండ్ల రామకృష్ణ, థామస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, టీటీడీ ఈవో శ్యామలరావు,అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు ఘన స్వాగతం పలికారు.చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్, నందమూరి లోకేశ్వరి మంగళవారమే నారావారిపల్లి చేరుకోగా నందమూరి కుటుంబీకులు వసుంధర, శ్రీమాన్, శ్రీనివాస్ తదితరులు బుధవారం మధ్యాహ్నం వచ్చారు. నందమూరి బాలకృష్ణ సహా పలువురు నందమూరి కుటుంబీకులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులు గురువారం ఉదయం నారావారిపల్లి రానున్నట్టు సమాచారం.



నారావారిపల్లిలో మంత్రి లోకేశ్

రామ్మూర్తి కర్మక్రియలకు విస్తృత ఏర్పాట్లు

చంద్రగిరి మండలం నారావారిపల్లిలో గురువారం రామ్మూర్తి నాయుడి కర్మక్రియల కోసం పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత పాతిక వేలమందికి భోజనాలు ఏర్పాటు చేయాలని భావించినా భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో 15 వేలమందికి సరిపడా సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే పులివర్తి నానీ, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్ తదితరులు నారావారిపల్లిలో ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. కాగా సీఎం సోదరుడి కర్మక్రియలకు హాజరయ్యేందుకు మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన రెడ్డి బుధవారం సాయంత్రానికి తిరుపతి చేరుకోగా మంత్రి వాసంశెట్టి సుభాష్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకరు కె.రఘురామ కృష్ణ రాజు గురువారం ఉదయం చేరుకోనున్నారు.

మాజీ మంత్రి అమర్‌కు చేదు అనుభవం

విమానాశ్రయంలో సీఎంను స్వాగతించేందుకు అనుమతించని సెక్యూరిటీ

కలెక్టర్ చెప్పినా వినిపించుకోని వైనం

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు బుధవారం సాయంత్రం రేణిగుంటలోని విమానాశ్రయానికి వెళ్ళిన మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి చేదు అనుభవం ఎదురైంది.తన స్వగ్రామమైన నారావారిపల్లిలో గురువారం జరిగే తమ్ముడి కర్మక్రియలకు హాజరయ్యేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ బుధవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో రేణిగుంట చేరుకున్నారు. వారికి స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి విమానాశ్రయానికి వెళ్ళారు. అయితే వెలుపలి గేటు వద్దే ఆయన్ను సీఐఎస్ఎఫ్ అధికారులు ఆపేశారు. తాను మాజీ మంత్రినని, అధికార పార్టీ ఎమ్మెల్యేనని అమర్ చెప్పినా వినిపించుకోలేదు. విమానాశ్రయం లోపల వీఐపీ లాంజ్‌లో నిలుచున్న కలెక్టర్ వెంకటేశ్వర్ వెలుపల నిలుచుని వున్న అమరనాథరెడ్డిని గమనించి అక్కడికి చేరుకుని సీఐఎస్ఎఫ్ సిబ్బందికి చెప్పి లోనికి తీసుకెళ్ళారు. అయితే టెర్మినల్ నుంచీ ఎయిర్‌పోర్టు రన్‌వే పైకి వెళుతుండగా అక్కడ మళ్ళీ భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఆయన ఎమ్మెల్యే అంటూ కలెక్టర్ చెప్పినా అనుమతించలేదు. దీంతో స్వరం పెంచిన కలెక్టర్ తాను జిల్లా మేజిస్ట్రేట్‌నని, ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి స్వాగతం పలకడానికి రన్‌వేపైకి వెళతారని చెప్పినా సిబ్బంది ఏమాత్రం వినిపించుకోలేదు. సీఎం విమానం ల్యాండయ్యే సమయం సమీపిస్తుండడంతో తనకోసం టెర్మినల్ గేటు వద్ద ఆగిపోయిన కలెక్టర్‌ను రన్‌వేపైకి వెళ్ళమని కోరిన అమర్ తాను మౌనంగా విమానాశ్రయం నుంచీ వెలుపలికి వచ్చేశారు. వెంట వచ్చిన అనుచరులు, సహచర నేతల ఎదుట అవమానం జరిగిందంటూ తీవ్ర మనస్తాపానికి గురైనట్టు తెలిసింది.

రన్‌వే పైకి పలువురు ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలకడానికి తిరుపతి, శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు, వెంకటగిరి, జీడీనెల్లూరు ఎమ్మెల్యేలతోపాటు డాలర్స్ దివాకర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి తదితర టీడీపీ నాయకులు సైతం పలువురు విమానాశ్రయ రన్‌వే పైకి చేరుకున్నారు. వారంతా సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికారు. అయితే ఎమ్మెల్యే అమర్‌ను మాత్రం విమానాశ్రయ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం సీఎంకు విమానాశ్రయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో వున్న వారు స్వాగతం పలికేందుకు అనుమతి ఇస్తారు. సంబంధిత జాబితా కలెక్టర్ నుంచీ విమానాశ్రయ డైరెక్టర్‌కు వెళితే, డైరెక్టర్ ఆ జాబితాను సీఐఎస్ఎఫ్ సిబ్బందికి పంపుతారు. జాబితాలోని వ్యక్తులను వారు విమానాశ్రయం లోపలికి, అలాగే రన్‌వే పైకి అనుమతిస్తారు. కలెక్టర్ కాకుండా సీఎం కార్యాలయం నుంచీ కూడా విడిగా జాబితా వస్తుంది. అందులో పార్టీ ముఖ్యుల పేర్లు వుంటాయి. ఆ జాబితా కూడా కలెక్టర్ నుంచే విమానాశ్రయానికి వెళుతుంది. వాస్తవానికి ఈ జాబితాతో సంబంధం లేకుండా కూడా ఎమ్మెల్యేలను లోనికి అనుమతించాల్సి వుంటుంది. ఇతర ఎమ్మెల్యేలను, పదవులు లేని పార్టీ నాయకులను కూడా రన్‌వే పైకి అనుమతించిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది జిల్లాలోనే సీనియర్ ఎమ్మెల్యే అయిన అమరనాథరెడ్డిని అడ్డుకోవడం కూటమి పార్టీల వర్గాల్లో చర్చనీయాంశమైంది.



కుప్పం వయా గదిలో వర్చువల్ మండల మీట్ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీఎస్ఎం తదితరులు (ఇన్‌సెట్లో) వివిధ సచివాలయాల నుంచి మండల మీట్‌లో పాల్గొన్న సర్పంచ్‌లు, కార్యదర్శులు

సాంకేతిక శకం

కుప్పంలో వర్చువల్ మండల మీట్

- హాజరైన ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్
- ఎంపీడీవో సాయిలహరికి అభినందన

కుప్పం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సమావేశం బుధవారం తొలిసారిగా వర్చువల్ పద్ధతిలో జరిగింది. మండల కార్యాలయంలోని ఒక గదిలో కూర్చుని, ఎక్కడెక్కడో ఉన్న సచివాయాల్లోని సర్పంచులు, కార్యదర్శులతో వర్చువల్‌గా ఈ సమావేశం నిర్వహించారు. కుప్పం మండల సచివాలయంలో వర్చువల్ ఇంటరాక్షన్ ఏరియా (వయా)ను ఎంపీడీవో సాయి లహరి ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అలాగే మండలంలోని మొత్తం 31 పంచాయతీల్లోని 21 సచివాలయాలకు సీసీ కెమెరాలు, సీసీ టీవీలు ఏర్పాటు చేయించారు. వయా గదిలో ఏర్పాటు చేసిన విజువల్ ప్యానెల్, ప్రత్యేకమైన సీసీ కెమెరాల ద్వారా ఆయా సచివాలయాలలోని గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు, ఇతర సిబ్బందితో అనుసంధానమయ్యేలా వర్చువల్ వలయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో కుప్పం మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11గంటలకు ప్రారంభమైంది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, ఎంపీపీ అశ్విని, ఎంపీడీవో సాయి లహరితో పాటు మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. మరికొందరు సర్పంచులు, కార్యదర్శులు తమ తమ పంచాయతీ సచివాలయాల్లోనే వుండిపోయారు. తొలుత అర్ధగంట పాటు సాధారణ పద్ధతిలో సమావేశం నడిచాక వర్చువల్ ఇంటరాక్షన్ ఏరియా (వయా) గదిని ఎమ్మెల్సీ , ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ప్రారంభించారు. ఈ గదిలో కూర్చుని ఆయా సచివాలయాల్లోని సర్పంచులు, కార్యదర్శులతో వర్చువల్‌గా మండల సమావేశం నిర్వహించారు. వారితోపాటు మిగిలినవారు కూడా గూగుల్ మీట్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఎక్కడివారక్కడే ఉండి, తమ గ్రామాల పరిధిలోని సమస్యలను విన్నవించారు. వయా గదినుంచే ఎమ్మెల్సీ వారికి సూచనలు, సలహాలు ఇవ్వడమేకాక, పనితీరు మెరుగుపరుచుకోవాలంటూ హెచ్చరికలు కూడా జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా సాంకేతికతను అభివృద్ధిపరిచి పాలనా సౌలభ్యంతోపాటు పారదర్శకత తీసుకురావడం దేశంలోనే ఇదే మొదలన్నారు. ఈ ఘనత సాధించిన ఎంపీడీవో సాయిలహరిని ఆయనతోపాటు పీఎస్ఎం అభినందించారు. వయాగదిలో కూర్చునే మండలంలో ఎక్కడ ఏ శాఖకు సంబంధించిన అభివృద్ధి పని జరుగుతున్నా సంబంధిత సిబ్బందిని అక్కడికి పంపి, మానిటరింగ్ చేయవచ్చని ఎంపీడీవో సాయి లహరి ఆయనకు వివరించారు.వారిద్దరూ వెళ్లిపోయాక ఎంపీపీ అశ్విని, ఎంపీడీవో సాయి లహరి వర్చువల్ విధానం ద్వారా మండల సమావేశాన్ని కొనసాగించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో తుపాను కంట్రోల్ రూమ్

విపత్తులను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల చిత్తూరు జిల్లాలో మూడ్రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, అయితే ఎక్కడా ఎటువంటి నష్టం జరుగకుండా చూడాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్, డివిజన్, మండలకేంద్రాల్లో కంట్రోల్‌రూములను అందుబాటులోకి తెచ్చి అధికారులు వారి ప్రధాన కార్యస్థానాల్లోనే ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, చెరువులు, కాలువల వెంబడి పర్యటించి కరకట్టలను పరిశీలించాలని సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూము సిబ్బంది 29వ తేదివరకు విధులు నిర్వహిస్తారు. తహసీల్దార్ కె. పద్మజను ఓవరాల్ ఇన్‌చార్జిగా నియమించారు.ఇందుకు ఫోన్‌నెం 94910 77354ను ఏర్పాటు చేశారు.

కాణిపాక ఆలయానికి అయ్యప్ప భక్తుల తాకిడి



క్యూలైన్లలో అయ్యప్ప భక్తులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాణిపాకం బుధవారం అయ్యప్ప భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు భారీగా దర్శనానికి వచ్చారు. శబరిమలకు వెళుతూ తొలుత వరసిద్ధుడిని దర్శించుకోవడం ఆనవాయితీ. అయ్యప్ప భక్తులతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. స్వామి దర్శనానికి నాలుగు గంటలకు పైగా సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తుల మధ్య ఇబ్బందులు తలెత్తకుండా ఈవో గురుప్రసాద్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఆలయం రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది.

ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు

నేటితో గడువు పూర్తి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత నెల 29న ప్రచురించిన ముసాయిదా జిల్లా ఓటరు జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు గురువారంతో ముగుస్తుందని జిల్లా రెవిన్యూ అధికారి మోహన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాపై గత నెల 29 నుంచి గురువారం వరకు ఆక్షేపణలు, అభ్యంతరాల స్వీకరణ, క్లెయిమ్‌ల స్వీకరణ కొనసాగిందని చెప్పారు.వాటిని డిసెంబరు 24వ తేదీ లోగా పరిష్కరిస్తామని వివరించారు. తుది ఓటరు జాబితాను 2025 జనవరి 6న ప్రచురిస్తామని వెల్లడించారు. ఈనెల 9, 10, 23, 24 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియకు 4693 దరఖాస్తులు అందాయని ఆయన వివరించారు. కొత్తగా ఓటరు నమోదుకోసం ఎన్నికలు ముగిసిన రోజు నుంచి ఇప్పటివరకు ఫారం -6 ద్వారా 46,756 దరఖాస్తులందగా, ప్రస్తుతం 1650 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తొలగింపుల కోసం 30,007 దరఖాస్తులందగా, వాటిలో 21,569 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. మార్పులు, చేర్పుల కోసం 54,914దరఖాస్తులందగా, ప్రస్తుతం 3676 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో వున్నట్లు ఆయన తెలిపారు.







చిత్తమెరిగిన చిత్తానూరమ్మ

నేటినుంచి తిరుచానూరు బ్రహ్మోత్సవాలు

హరి అంతరంగ అలమేలుమంగ పద్మావతి అమ్మవారికి ప్రీతిపాత్రమైనవి కార్తీక బ్రహ్మోత్సవాలు. తిరుమల శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల తర్వాత అంత వైభవంగా జరుగుతాయి తిరుచానూరు బ్రహ్మోత్సవాలు. ఏటికేడాది ఈ వేడుకలను టీటీడీ మరింత ఘనంగా నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే దీపకాంతులతో తిరుచానూరు వెలిగిపోతోంది. తిరుపతి నుంచి గరుడవారధి పైనా, కిందా ఏర్పాటు చేసిన దీపతోరణాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. నిజానికి అలిమేలు మంగమ్మకు, తిరుమల శ్రీనివాసుడికి వలే ఏడాది పొడవునా అనేక ఉత్సవాలు జరుగుతుంటాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

పద్మావతిదేవి ఆలయాన్ని తిరుచానూరులో 1820-50 సంవత్సరాల్లో హథీరాంజీ మఠాధిపతులు జీర్ణోద్ధరణ చేసినట్లు చరిత్ర చెబుతోంది. అప్పటినుంచి అమ్మవారి ఆలయంలో నిత్య, వార, పక్ష, మాస, సంవత్సరాది ఉత్సవాలను ఆలయ వేద పండితులు పాంచరాత్ర ఆగమం ప్రకారం నిర్వహిస్తున్నారు.

నిత్యోత్సవాలు

ప్రతిరోజూ అలిమేలు మంగతాయారుకు సుప్రభాతం, సహస్రనామార్చన, నిత్యార్చనతోపాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఏకాంతసేవ, కుంకుమార్చన, వేద ఆశీర్వచన సేవలు జరుగుతాయి.

వారోత్సవాలు

సోమవారం అష్టదళ పాదపద్మారాధన, గురువారం తిరుప్పావడ సేవ, శుక్రవారం మూలవర్లకు అభిషేకం, వస్త్రాలంకరణ సేవ, లక్ష్మీపూజ, ఉద్యానవనంలో ఉత్సవర్లకు అభిషేకం, సహస్ర దీపాలంకరణ సేవ, శనివారం సామవేద పుష్పాంజలి చేపడతారు.

పక్షోత్సవాలు

ప్రతి ఏకాదశి రోజున ద్వార పాలకులకు కర్పూరబింబిమాస, స్నపన విశేషాలు నిర్వహిస్తారు.

మన చిత్తానూరు

శుక మహర్షిచే పాంచరాత్ర ఆగమం ప్రకారం అమ్మవారు పూజలందుకున్న తిరుశుకనూరు కాలక్రమంలో తిరుచానూరుగా నామరూపాంతరం చెందింది అంటారు. అలర్మేల్‌మంగై క్షేత్రంగా తిరుచానూరుకు అలిమేలు మంగాపురం అనే మరో పేరుకూడా ఉంది. నేటికీ తిరుచానూరును అలిమేలు మంగాపురంగానే పిలుస్తుంటారు. ఆలర్ అంటే అలలు, మేల్ అంటే పైన మంగై అంటే అమ్మవారు. పద్మావతి అమ్మవారు పద్మసరోవరంలో అలలపై నుంచి బంగారు కమలంలో ఆవిర్భవించారని పండితులు అర్థం చెబుతారు. తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల వారు మాత్రం తరాలుగా చిత్తానూరు అనే అంటూ ఉంటారు.

వార్షికోత్సవాలు

కార్తీక మాసపు బ్రహ్మోత్సవాల్లో లక్ష కుంకుమార్చన, పుష్పయాగం నిర్వహిస్తారు. మార్గశిర మాసంలో ధనుర్మాస పూజలు, మాఘమాసంలో త్రైమాసం, శరడులు (తిరుమాంగల్యం), ఫాల్గుణమాసంలో ఫాల్గుణి ఉత్తర ఉత్సవం, చైత్రమాసంలో ఉగాది ఆస్థానం, వసంతోత్సవాలు, జేష్టమాసంలో పద్మసరోవరంలో తెప్పోత్సవాలు, శ్రావణమాసంలో కృష్ణాష్టమి వేడుకలు, వరలక్ష్మీ వ్రతం, భాద్రపదంలో పవిత్రోత్సవాలు, ఆశ్వయుజంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు.

మాస ఉత్సవాలు

ప్రతినెలా మొదటి బుధవారం అష్టోత్తర శతకలశాభిషేకం, పద్మావతి అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాడం పురస్కరించుకుని గజవాహనసేవ, రోహిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామికి అభిషేకం, వీథోత్సవం, అష్టమి తిథిన అమ్మవారి మూలవర్లకు అభిషేకం, ఉత్తరాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి, సమేత సుందరరాజ స్వామివారికి అభిషేకం, ఊంజల్ సేవ, తిరుచ్చి ఉత్సవం, ఆస్థానం జరుగుతాయి.

యాత్రికులలో కళకళ

ఒకనాటి చిత్తనూరు అలమేలుమంగ ఆలయానికి రెండువేల మంది భక్తులు మాత్రమే వచ్చేవారు. ప్రస్తుతం నిత్యం 30వేల మంది భక్తులు అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో పంచమీతీర్థం రోజు సుమారు లక్ష మందికి పైగా పద్మసరోవరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

అందరికీ అమ్మవారి దర్శనం

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి ● టీటీడీ ఈవో శ్యామలరావు



అన్నప్రసాదాన్ని పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, అధికారులు

తిరుచానూరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులందరికీ దర్శనం కల్పిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. వాహన సేవలు, ఇతర కార్యక్రమాలను భక్తులు వీక్షించేందుకు వీలుగా తిరుచానూరు పరిసర ప్రాంతాలతోపాటూ పద్మపుష్కరిణికి నాలుగు వైపులా ఈసారి మొత్తం 20 ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశామన్నారు. గురువారం నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. భక్తులకు సైన్ బోర్డులు, రేడియో అండ్ బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామన్నారు. పంచమీతీర్థం సందర్భంగా డిసెంబరు 5వ తేదీ సాయంత్రం నుంచి భక్తులు వేచి ఉండేందుకు తిరుచానూరు పరిసర ప్రాంతాలైన జడ్పీ హైస్కూల్, పూడి రోడ్డు, నవజీవన్, తిరుచానూరు గేటు వద్ద 4 హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 120 కౌంటర్ల ద్వారా 50 వేలకుపైగా భక్తులకు తాగునీరు, బాదంపాలు, బిస్మిల్లాబాత్, పెరుగుఅన్నం, విజిటబుల్ ఉప్మాతోపాటూ ఈసారి అదనంగా చక్కెర పొంగలి అందిస్తామన్నారు. అన్నం, పప్పు, సాంబారు, రసం, స్వీట్‌తోపాటూ ఈసారి అదనంగా కర్రీని కూడా అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. అమ్మవారి వాహన సేవలను ఎస్వీబీసీలో హెచ్‌డీ క్వాలిటీతో ప్రత్యక్ష ప్రసారాలతో పాటూ, ఎస్వీబీసీ ఆన్‌లైన్ రేడియో, యూట్యూబ్ ద్వారా కూడా ప్రసారాలు అందిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో టీటీడీ భద్రతా సిబ్బంది, పోలీసులతో కలిపి 460 మంది, పంచమీతీర్థం రోజున 1500 మంది పోలీసులు, 600 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. డిసెంబరు 6న మధ్యాహ్నం 12.15 గంటల మధ్య పద్మ పుష్కరిణిలో పంచమీతీర్థం చక్రస్నానం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, విజివో సదాలక్ష్మి, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్య ప్రతీకలు స్త్రీల స్వీయ చరిత్రలు

● పోపూరి స్మారకోపన్యాసంలో ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



ప్రొఫెసర్ కాత్యాయని విద్మహేను సన్మానిస్తున్న రచయిత్రి ఓల్గా, ప్రొఫెసర్ మధుజ్యోతి, యువశ్రీ, సుభాషిణి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్త్రీలు రాసిన స్వీయ చరిత్రలు సామాజిక చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని కాకతీయ యూనివర్సిటీ తెలుగు రిటైర్డు ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో బుధవారం పోపూరి వెంకటసుబ్బారావు స్మారక ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. తెలుగు సాహిత్య, సామాజిక చరిత్ర స్త్రీల చరిత్రతో ముడిపడి ఉందన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం మొదలు విప్లవ, దళిత, ప్రాంతీయ, మైనారిటీ వాద ఉద్యమాలనూ స్త్రీ దృక్కోణం లేకుండా పరిశీలించలేమని స్పష్టం చేశారు. అయితే, స్త్రీల ప్రతిభ, కృషి, త్యాగం మరుగున పడ్డాయనీ, ఇందుకు నేటికీ సమాజంలోని పురుషాధిపత్య భావజాల ఆధిక్యతే కారణమని అభిప్రాయపడ్డారు. సమాజాన్నీ, సాహిత్యాన్నీ స్త్రీ కోణంలో నుంచీ పరిశోధన చేపట్టవలసిన అవసరం ఉందని సూచించారు. రచయిత్రి ప్రతిమ మాట్లాడుతూ.. విద్యకు దూరంగా నెట్టివేయబడిన స్త్రీలు ఆయా రంగాల్లో ఎదిగి స్వీయ చరిత్రలు రాయడం అంత తేలికైన విషయం కాదని అన్నారు. రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ.. విద్య ద్వారానే స్త్రీ చైతన్యం, స్త్రీల అభివృద్ధి, స్త్రీ సాధికారత సాధ్యమవుతాయని అన్నారు. డీన్ ప్రొఫెసర్ వాణి మాట్లాడుతూ.. తెలుగు విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో విశేష కృషి చేస్తూ ఉందని తెలిపారు. సభాధ్యక్షత వహించిన తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా తన తండ్రి పోపూరి వెంకటసుబ్బారావు స్మారకోపన్యాసం నిర్వహించేందుకు రచయిత్రి ఓల్గా అందిస్తున్న తోడ్పాటును అభినందించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ దొమ్మరాజు యువశ్రీ సభలో ప్రసంగించారు. 'స్త్రీ-సామాజిక భద్రత' అనే అంశంపై నిర్వహించిన కథల పోటీలో విజేతలు వాణిశ్రీ, గీతాంజలి, బాలకృష్ణలకు బహుమతులను అందజేశారు.

తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న అంతర్ జిల్లా ముఠా అరెస్టు

● 1990 గ్రాములు స్వాధీనం.. మూడు కేసులు నమోదు



తిరుపతిలో వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్స్, తిరుపతి అర్బన్ ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. వారి నుంచి 1990 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఎక్సైజ్ అర్బన్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర తెలిపిన ప్రకారం.. ఎంఆర్‌పల్లికి చెందిన చింతగుంట చైతన్య గణేష్, అవిలాల శానప్పకాలనీకి చెందిన మంగళకుమార్, అవిలాలలో ఉంటున్న టి.రాంబాబు, ఎస్‌టీవీ నగర్‌కు చెందిన పాల్‌రాజ్, కడప పట్టణం కందిపాలేనికి చెందిన కొయ్య సోమశేఖర్, పుల్లూరుకు చెందిన గోవిందు జ్ఞానేష్, పక్కీర్‌పల్లికి చెందిన ఎన్.సుబ్బరాయుడు ఒక ముఠాగా ఏర్పడ్డారు. కొన్నేళ్లుగా వీరు గంజాయిని కొని తిరుపతికి తీసుకొస్తున్నారు. శివారు ప్రాంతాల్లో స్టాకు పెట్టి వాటిని పొడి చేసి చిన్న, చిన్న పొట్లాలుగా ప్యాక్ చేయిస్తున్నారు. ఇలా ఐదు గ్రాములు, 10 గ్రాములు, 15 గ్రాములు, 25 గ్రాముల పొట్లాల్లో ఉంచి విక్రయిస్తున్నారు. వీరి కోసం ఎక్సైజ్ ఈఎస్, టాస్క్‌ఫోర్సు అధికారులు కొద్ది రోజులుగా నిఘా ఉంచారు. కడప, తిరుపతి, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు అధికారులకు సమాచారం వచ్చింది. జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లి రెడ్డి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి ఆదేశాల మేరకు ఈఎస్ టాస్క్ టాస్క్‌ఫోర్స్ సీఐ శ్యామ్‌ప్రసాద్, ఎస్ఐ ఎస్.స్వామినాథన్, అర్బన్ సీఐ రామచంద్ర, ఎస్ఐ జయశంకర్, మహేష్, నరసింహ, హరికృష్ణ, సిబ్బంది బృందాలుగా విడిపోయారు. ఎంఆర్‌పల్లి శాంతిరనగర్ వద్ద విక్రయిస్తున్న ఇద్దరిని, మంగళం వద్ద మరో ఇద్దరిని, తిరుమలరెడ్డినగర్‌లో ఒకరిని అరెస్టు చేశారు. వారి నుంచి 1990 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని మూడు కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామచంద్ర చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించింది. రూ.3.53 కోట్లు లభించినట్లు బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 64,525 మంది శ్రీవారిని దర్శించుకోగా, 19,880 మంది తలనీలాలు సమర్పించారు.



శ్రీవారి సుప్రభాత సేవలో

నటి జ్యోతిక

తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీ నటి జ్యోతిక బుధవారం దర్శించుకున్నారు. వేకువజాము సుప్రభాతసేవలో ఆమె పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది ఆమెకు ప్రత్యేక దర్శనంతో పాటు లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు జ్యోతికను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

శ్రీకాళహస్తిలో తమిళ హాస్య నటుడు

యోగిబాబు



శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం తమిళ హాస్య నటుడు యోగిబాబు దర్శించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

హైదరాబాదు నుంచి శబరిమలైకి రేణిగుంట మీదుగా 18 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు27(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు, కాచిగూడ నుంచి కొట్టాయం వరకు డిసెంబరు 3 నుంచి రేణిగుంట మీదుగా 18 ప్రత్యేక రైళ్ళు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదులో ఈ ప్రత్యేక రైళ్ళు(07135) డిసెంబరు3, నుంచి 10,17, 24, 31తేదీల్లో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి బేగంపేట, వికారాబాదు, తాండూరు, రాయచూర్, గుంతకల్లు, రాజంపేట, రేణిగుంట,కాట్పాడి, కోయంబత్తూరు, పాల్‌కాడ్, ఎర్నాకులంటౌన్ మీదుగా మరుసటి రోజు 4.10 గంటలకు కొట్టాయానికి చేరుకుంటాయి. ఈ ప్రత్యేక రైళ్ళు (07136) డిసెంబరు 4 నుంచి (ప్రతి గురువారం) 11, 18, 25, జనవరి ఒకటవ తేదీల్లో రాత్రి 11.45 గంటలకు కొట్టాయంలో బయలు దేరి వచ్చిన మార్గంలోనే మరుసటి రోజు హైదరాబాదుకు చేరుకుంటాయి.

● కాచిగూడలో ఈ ప్రత్యేక రైళ్ళు(07133) వచ్చే నెల 5, 12, 19, 26 తేదీల్లో(ప్రతి గురువారం) మధ్యాహ్నం 3.40 గంటలకు బయలుదేరి షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, కర్నూలు సిటీ, రాజంపేట, రేణిగుంట,కాట్పాడి, అలువ, ఎర్నాకులంటౌన్ మీదుగా మరుసటి రోజు సాయంత్రం 6.50గంటలకు కొట్టాయానికి చేరుకుంటాయి. కొట్టాయంలో ఈ ప్రత్యేక రైలు(07134) డిసెంబరు 6, 13, 20, 27 తేదీల్లో రాత్రి 8.30 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో మరుసటి రోజు రాత్రి 11.40 గంటలకు కాచిగూడకు చేరుకుంటాయి.

పలు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి అకోల, పూర్ణా, సికింద్రాబాదు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను డిసెంబరు 6 నుంచి 30వ తేదీవరకు రాకపోకలు సాగిస్తాయని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

● తిరుపతి-అకోల మధ్య నడిచే ప్రత్యేక రైలు ప్రతి శుక్రవారం తిరుపతిలో.. ప్రతి ఆదివారం అకోలలో బయలుదేరుతుంది.

● పూర్ణా- తిరుపతి మధ్య నడిచేరైలు పూర్ణాలో ప్రతి సోమవారం బయలు దేరుతుంది. ఇదే రైలు తిరుపతిలో ఈ రైలు ప్రతి మంగళవారం బయలుదేరుతుంది.

● తిరుపతి-సికింద్రాబాదు మధ్య నడిచే రైలు, తిరుపతిలో ప్రతి ఆదివారం బయలుదేరుతుంది. ఇదే రైలు సికింద్రాబాదులో ప్రతి సోమవారం బయలుదేరుతుంది.

కదిరిదేవరపల్లి- గుంతకల్ మధ్య ప్యాసింజరు రద్దు

తిరుపతి- కదిరిదేవరపల్లి మధ్య రోజువారీగా రాకపోకలు సాగిస్తున్న ప్యాసింజరు రైలు డిసెంబరు ఒకటి నుంచి 31వ తేదివరకు కదిరిదేవరపల్లి-గుంటకల్ మధ్య తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి





పొలంలో రమణయ్య మృతదేహం - రమణయ్య(ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.... గ్రామానికి చెందిన ఇలకా రమణయ్య(58) బుధవారం ట్రాక్టర్‌కు కేజీ వీల్స్ తగిలించుకుని పొలంలో అదును దున్నుతున్నాడు. ఈ సమయంలో విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటర్‌కు సరఫరా చేసే తీగలు ట్రాక్టర్ సైలెన్సర్‌కు తగిలాయి. దీంతో షాక్‌కు గురైన రమణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిగ్‌బాస్ ఫేం ప్రియాంకపై చర్యలు తీసుకోండి

తిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఆదరణ పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో భక్తులను భయాందోళనకు గురిచేసేలా 'తిరుపతి దారిలో మాపై చిరుతపులి ఎటాక్ చేసింది' అంటూ ప్రాంక్ వీడియో చేసిన బిగ్‌బాస్ ఫేం ప్రియాంక, ఆమె స్నేహితుడు శివపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీటీడీ సభ్యుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. ఈ మేరకు ఆయన తిరుమల డీఎస్పీకి లేఖ రాశారు. కొద్దిరోజుల క్రితం ప్రియాంక, శివ అలిపిరి కాలినడకమార్గంలో చేసిన ఈ వీడియోపై ఆయన స్పందిస్తూ ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలన్నారు. ఇదే అంశంపై ఇప్పటికే టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కూడా స్పందించిన విషయం తెలిసిందే. టీటీడీ విజిలెన్స్ నుంచి ఫిర్యాదు అందిన తర్వాత కేసు నమోదు చేయాలని పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం. ఈప్రాంక్ వీడియోపై ఇప్పటికే వార్తలు రావడంతో సోషల్ మీడియా ఖాతాల నుంచి డిలీట్ చేసినట్టు తెలుస్తోంది.



అన్నదాతకు అండాదండ

● లాభాల బాటలో నగరి సహకార సంఘం

నగరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ప్రగతి అంటే పెదవి విరిచే ఈ రోజుల్లో నగరి సహకార సంఘం ఆదర్శంగా నిలుస్తోంది.1957వ సంవత్సరం ఆగస్టు 20వ తేదీన ప్రారంభమైన ఈ సంఘంలో ప్రస్తుతం 8925మంది రైతులు సభ్యులుగా ఉన్నారు.మూలధనం రూ56.36కోట్లుండగా 28.13లక్షలు డిపాజిట్లున్నాయి. రసాయన ఎరువులను, క్రిమిసంహారక మందులను, వరి, వేరుశనగ విత్తనాలను విక్రయిస్తూ రైతులకు చేదోడువాదోడుగా నిలుస్తోంది. సోనామసూరిలాంటి సన్నరకం బియ్యం మార్కెట్ ధర కన్నా తక్కువగా రైతులకు విక్రయిస్తోంది.జిల్లాలోనే ఓ సహకార సంఘం పెట్రోలు బంకు నిర్వహించడం కూడా ఇక్కడే కావడం విశేషం. సంఘం పరిధిలో వున్న నాలుగు గోదాముల అద్దె ద్వారా వార్షికాదాయం ఆర్జిస్తోంది.

అవార్డుల పంట

రైతులకు రుణాలందించడంతో బాటు మూలధనం రెట్టింపు చేసి ఆదాయ వనరులను పెంచుకుంటున్న నగరి సహకార సంఘం పదేళ్లుగా రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలుస్తోంది.లాభాల బాటలో నడిచే ఈ సహకారసంఘం పనితీరును అధ్యయనం చేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి సైతం ప్రత్యేక బృందాలు వచ్చాయి. నెదర్లాండ్స్ నుంచి కూడా ఓ బృందం వచ్చింది. 2016, 2017 సంవత్సరాల్లో ఉత్తమ సహకారసంఘం అవార్డు, 2018-19లో ఉత్తమ సీఈవో, ఉత్తమ అధ్యక్ష అవార్డులు, 2020-21లో ఉత్తమ సామర్థ్య అవార్డు, 2021-22లో ఆప్కాబ్ సామర్థ్య అవార్డును సాధించింది.



షాపింగ్ కాంప్లెక్స్



రసాయన ఎరువుల గోడౌన్



పెట్రోలు బంకు, జనరిక్ మందులషాపు

త్వరలో ఫంక్షన్‌హాలు

రైతుల ఇంట శుభకార్యాలకు సాయంగా నిలవాలని ఫంక్షన్‌హాలు నిర్మిస్తున్నాం. సహకారం సంఘం పరిధిలోని రైతులకు తక్కువ బాడుగకే ఈ హాలు ఇవ్వాలని నిర్ణయించాం. బ్యాంకులో లాకర్ సదుపాయం ఉంది. బంగారు నగలపై రుణాలు అందిస్తూ రైతులకు, చిరువ్యాపారులకు సాయమందిస్తున్నాం.

- తులసిపిళ్లై, సీఈవో

గో సంరక్షణ ట్రస్టుకు 3వేల డాలర్ల వితరణ



ఐరాల(కాణిపాకం), నంబరు27(ఆంధ్ర జ్యోతి): కాణిపాక వరసిద్ధుని ఆలయం ఆధ్వర్యంలో ని గో సంరక్షణ ట్రస్టుకు ప్రవాస భారతీయుడు కొల్లాఅజయ్ కుమార్ బుధవారం 3000 అమెరికన్ డాలర్లు చెక్కు రూపంలో విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం దాతను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

30మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను కారణంగా గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా మూడు మినహా 30 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాల వారీగా బంగారుపాళ్యంలో 9.2, విజయపురంలో 8.4, పెనుమూరులో 8.4, సోమలలో 8.0, తవణంపల్లెలో 7.6, శ్రీరంగరాజపురంలో 7.2, పూతలపట్టులో 6.2, పూతలపట్టులో 6.2, గంగవరంలో 5.8, పలమనేరులో 5.2, పెద్దపంజాణిలో 5.2, బైరెడ్డిపల్లిలో 5.0, సదుంలో 4.4, రామకుప్పంలో 4.4, వెదురుకుప్పంలో 4.2, చౌడేపల్లిలో 3.2, గుడిపాలలో 3.2, యాదమరిలో 3.0, గంగాధరనెల్లూరులో 2.8, కార్వేటినగరంలో 2.4, పుంగనూరులో 2.4, శాంతిపురంలో 2.0, చిత్తూరులో 2.0, వి.కోటలో 1.8, పులిచెర్లలో 1.2, రొంపిచెర్లలో 1.2, నింద్రలో 1.2, గుడుపల్లెలో 1.2, కుప్పంలో 1.0, నగరిలో 1.0 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

విశాఖ టు తిరువణ్ణామలై

● ఓ యువకుడి 1150 కి.మీ. పాదయాత్ర



తిరువణ్ణామలైకు నడిచి వెళుతున్న వంశీ

చిత్తూరు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం కోసం ఓ యువకుడు సుదీర్ఘపాత్రను ప్రారంభించాడు. విశాఖపట్నం నుంచి తమిళనాడులోని తిరువణ్ణామలై సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనం కోసం 1150 కిలోమీటర్ల దూరం పాదయాత్రగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం చిత్తూరుకు చేరుకున్నాడు. విశాఖపట్నం జిల్లా పెందుర్తి నియోజకవర్గం మండలవ దేశపాత్రునిపాళ్యంలోని సాయినగర్‌కాలనీకి చెందిన వంశీ గత ఏడాది బస్సులో తిరువణ్ణామలై వెళితే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనం కాలేదు. ఈ సందర్భంలో నడిచి వచ్చి దర్శనం చేసుకుంటానని మొక్కుకున్నాడు. ఈనెల 2న ఇంటి నుంచి చెప్పులు లేకుండా పాదయాత్ర ప్రారంభించాడు. అన్నవరం, విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీకాళహస్తీశ్వరుడు, తిరుపతి వెంకటేశ్వరస్వామిలను దర్శనం చేసుకున్నాడు. తాజాగా కాణిపాకం వినాయకస్వామిని దర్శించుకున్నాడు. ఇక్కడ నుంచి తిరువణ్ణామలైలో స్వామి దర్శనం చేసుకుంటానని వంశీ ఆంధ్రజ్యోతికి తెలిపాడు.

భూరికార్డుల స్కానింగ్ ప్రారంభం



స్కానింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గతంలో మిస్సింగ్ రికార్డులుగా గుర్తించిన భూ, సర్వే శాఖకు చెందిన ఫెయిర్ అడంగళ్, ఎ-రిజిస్టర్లు, రెవిన్యూశాఖకు చెందిన ఈనాం రిజిస్టర్ల స్కానింగ్ ప్రక్రియ కలెక్టరేట్‌లో బుధవారం ప్రారంభమైంది.ఈసీఎం టెక్నాలజీతో ఈ స్కానింగ్ ప్రక్రియ సాగుతుంది. సర్వే శాఖకు చెందిన 150 రికార్డులు, రెవిన్యూశాఖకు చెందిన 70 రికార్డుల స్కానింగ్ ప్రక్రియ చేపట్టారు. బుధవారం నుంచీ ప్రారంభమైన ఈ ప్రక్రియ నెలరోజుల పాటు జరుగుతుంది. కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం తనిఖీ చేసి గడువులోగా ప్రక్రియను పూర్తిచేయాలని సర్వే, రెవిన్యూ అధికారులను ఆదేశించారు.

కుప్పానికి రేపు అంతర్జాతీయ ప్రతినిధి బృందం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రైతు సాధికార సంస్థ ద్వారా అమలుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించేందుకు అంతర్జాతీయ ప్రతినిధి బృందం కుప్పం నియోజకవర్గంలో శుక్రవారం పర్యటిస్తుందని రైతు సాధికార సంస్థ సీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కుప్పం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ప్రకృతివ్యవసాయ మోడళ్లను, పొలాలను సందర్శించి ప్రకృతివ్యవసాయ కార్యక్రమ అమలు విధానం గురించి తెలుసుకుంటారన్నారు. రైతులతో ముఖాముఖి ముచ్చటించి వారి అనుభవాలను తెలుసుకుంటారని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆగ్రో ఎకాలజీలో జరుగుతున్న నూతన పరిజ్ఞానాన్ని పరిశీలించే క్రమంలో భాగంగా పర్యటిస్తున్న ఈ బృందంలో 20 దేశాలకు చెందిన ఉపాధ్యాయులు, 27 మంది ప్రతినిధులతో పాటు తొమ్మిదిమంది భారతీయ ప్రతినిధులు కూడా వుంటారన్నారు. ఆగ్రో ఎకాలజీ అభ్యాసకులు, పరిశోధకులు, రైతు ప్రతినిధులు, వ్యవసాయ నిపుణులు ఈ పర్యటనలో పాల్గొంటారని చెప్పారు.

ఆ ఆంగ్ల పదాలను తెలుగులోకి తెచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఉదయకుమారి

గుడుపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జన బాహుళ్యం లోకి వెళ్లిపోయిన ఆంగ్ల పదాలను తెలుగులోకి తెచ్చుకోవాలని డాక్టర్ ఉదయ్‌కుమారి పేర్కొన్నారు. దోహా నగరంలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో ద్రావిడ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఉదయ కుమారి పాల్గొన్నారు. పరభాషా పదాలన్నీ పరికల్పిత పదాలు కావని, కొన్ని సంవత్సరాలుగా ప్రజా బాహుళ్యంలో నలిగిన తరువాత సాధారణ పదాలుగా మారుతాయన్నారు. అలాంటి ఆంగ్ల పదాలను తెలుగులోకి తెచ్చుకోవడానికి అవసరమైన చర్యల గురించి ఆమె సదస్సులో వివరించారు. డాక్టర్ పళని మాట్లాడుతూ బుద్ధుడు ప్రవచించిన సమాధి స్థితి కంటే అచల స్థితి మరింత ఉత్తమమైనదని తెలిపారు. గాఢమైన తత్వాన్ని వేమన సులభమైన తెలుగు పదాలతో తెలుగువారికి అందించారని పేర్కొన్నారు.

ద్రావిడ వర్సిటీలో రేపటి వరకు పీజీ స్పాట్ అడ్మిషన్లు

గుడుపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఈ నెల 29 వరకు పీజీ స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ తెలిపారు. డిగ్రీ పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డీన్ కార్యాలయంలో, విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని పేర్కొన్నారు.

పద్ధతి మార్చుకోండి.. లేకుంటే వెళ్లిపోండి!

● కుప్పం మండల మీట్‌లో అధికారులపై ఎమ్మెల్సీ కంచర్ల ఆగ్రహం



కుప్పం మండల సచివాలయంలో వర్చువల్ ఇంటరాక్షన్ ఏరియా (వయా)ను ప్రారంభిస్తున్న శ్రీకాంత్, మునిరత్నం

కుప్పం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'ఉంటే బాధ్యతగా పనిచేయండి, లేదంటే ఇక్కడినుంచి వెళ్లిపోండి.' అని అధికారులకు ఖరాఖండీగా చెప్పేశారు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్. కుప్పం మండల సర్వసభ్య సమావేశం బుధవారం సుమారు అర్ధగంటపాటు సాధారణ పద్ధతిలోనే జరిగింది. ఈ సమయంలో మండల ఉద్యాన శాఖాధికారి డింపు ప్రియ తమ శాఖ పరిధిలో ఉద్యాన రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలు, అందిస్తున్న పథకాలను గురించి ఏకరువు పెట్టారు. దీనిపై ఒక సర్పంచి పైకి లేచి తమకు ఎటువంటి పథకాల గురించీ ఎవరూ చెప్పడంలేదనీ, వంగనారుకోసం దరఖాస్తు చేసుకుంటే ఇంత దాకా రాలేదని ఫిర్యాదు చేశారు. వెంటనే ఎమ్మెల్సీ కంచర్ల అందుకుని, ఆయా పథకాల గురించి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా, శిక్షణ ఇస్తున్నారా అని ఉద్యాన శాఖాధికారిని ప్రశ్నించారు. నారు తదితరాలను అందిస్తున్న ప్రైవేటు కంపెనీలు ఆ పని చేస్తున్నాయని ఆమె సమాధానం ఇచ్చారు. దీంతో ఎమ్మెల్సీ ఆగ్రహానికి గురయ్యారు. ప్రజలకు పథకాలను చేరువ చేస్తారని, ఆ పథకాలను కింది స్థాయి దాకా అర్హులకు అందిస్తారన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం అధికారులను నియమిస్తుందన్నారు. వేరెవరో ఆ బాధ్యత చూసుకుంటే ఇక మీరెందుకని నిలదీశారు. బాధ్యతగా పనిచేస్తే చేయాలని, లేదంటే ఇక్కడినుంచి వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.అంతకుముందు ఎంఈవో మహబూబ్ బాషా మండలంలోని విద్యాభివృద్ధి, ఇతర అంశాలను గురించి ప్రస్తావించారు. ఆయన మాట్లాడిన తర్వాత ఎమ్మెల్సీ కంచర్ల అందుకుంటూ విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు మంగళవారం నియోకవర్గానికి వచ్చి అగస్త్య ఫౌండేషన్‌లో జరుగుతున్న హెచ్ఎంల సమావేశానికి హాజరైన విషయం ముందుగా తనకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని నిలదీశారు. ఆయనది ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూలా లేక అకస్మాత్తుగా వచ్చారా అని ప్రశ్నించారు. ముందుగా నిర్ణయమైన షెడ్యూలేనని ఎంఈవో చెప్పడంతో మరింత ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. విద్యాశాఖ డైరెక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రదేశం తమ పరిధిలో లేదని, గుడుపల్లె మండల పరిధిలోనిదని ఎంఈవో మహబూబ్ బాషా చెప్పి తప్పించుకున్నారు. గుడుపల్లె ఎంపీడీవో ఎక్కడ అని ప్రశ్నించిన ఎమ్మెల్సీ కంచర్ల, జరుగుతున్నది కుప్పం మండల సమావేశమని గ్రహించి బలవంతంగా వస్తున్న ఆగ్రహాన్ని అణచుకున్నారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

● వైభవంగా లక్ష కుంకుమార్చన

● నేడు ధ్వజారోహణం



పుష్కరిణి చుట్టూ విద్యుద్దీపాల వెలుగులు

తిరుచానూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి, తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారి సన్నిధి ముఖమండపం వద్ద సర్వసేనాధిపతి విష్వక్సేనుడిని కొలువుదీర్చారు. కంకణభట్టాచార్యులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వేంచేపుగా ఉద్యానవనానికి తీసుకొచ్చి పుట్టమన్ను సేకరించారు. మాడవీధుల్లో ఊరేగింపుగా ఆలయంలోని యాగశాలకు తీసుకొచ్చారు. నవపాలికలో పుట్టమన్ను నింపి అందులో నవధాన్యాలు వేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణం

గురువారం ఉదయం 9.30 గంటలకు ధనుర్లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రంగా అర్చకులు ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అమ్మవారితో పాటూ గజచిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొస్తారు. ధ్వజస్తంభంపైకి గజపటాన్ని ఎగురవేయడంతో ధ్వజారోహణం పూర్తవుతుంది. రాత్రికి చిన్నశేష వాహన సేవతో అమ్మవారికి వాహన సేవలు ప్రారంభమవుతాయి.



విష్వక్సేనుడి ఊరేగింపు



పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

ముత్యపు కవచంలో అమ్మవారి దర్శనం

పద్మావతి అమ్మవారు బుధవారం ముత్యపు కవచంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజూ వజ్ర, వైఢూర్య, స్వర్ణాభరణాలతో దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవ వేళ మాత్రమే అమ్మవారి మూలవర్లకు ప్రత్యేకంగా తయారు చేయించిన ముత్యపు కవచాన్ని అలంకరిస్తారు.

అమ్మవారికి లక్ష కుంకుమార్చన



పద్మావతి అమ్మవారికి బుధవారం ఉదయం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖ మండపానికి ఉత్సవర్లను తీసుకొచ్చి సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చారు. ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు ఆగమ శాస్త్రోక్తంగా అమ్మవారి లక్ష్మీ సహస్ర నామాలను లక్షసార్లు జపిస్తూ కుంకుమార్చన చేశారు. బ్రహ్మోత్సవాలకు ముందు రోజు లక్ష కుంకుమార్చన సేవ నిర్వహించడం ఆనవాయితీ.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 9- 9.30 గంటలు: ధ్వజారోహణం
మధ్యాహ్నం 12.30 గంటలు: స్నపన తిరుమంజనం
సాయంత్రం 7-9 గంటలు: చిన్నశేష వాహనం

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సుబ్రమణ్యం మృతదేహం

కుప్పం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణం తంబిగానిపల్లె సమీపంలో క్రిష్ణగిరి జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో బుధవారం రాత్రి ఒకరు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.... కుప్పం మండలం వసనాడు గొల్లపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం కుప్పం వచ్చి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. తంబిగానిపల్లె సమీపంలోకి వచ్చేసరికి అతడి వాహనాన్ని ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైసీపీ ఎమ్మెల్యేలతో ప్రజాధనం దుర్వినియోగం

మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్



తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలకు రాకుండా వైసీపీ ఎమ్మెల్యేలు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని చిత్తూరు జిల్లా పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 11మంది వైసీపీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడేందుకు కూడా సభకు రావడం లేదన్నారు. ప్రజల డబ్బుతో జీతాలు, భద్రత పొందుతున్నారన్నారు. అలాంటి వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఏ సీఎం చేయనంతగా మాజీ సీఎం జగన్ అధికార దుర్వినియోగం చేశారని తెలిపారు. కుప్పంలో అక్రమ మైనింగ్ చేసిన ఘనత వైసీపీ నాయకులకే దక్కిందన్నారు. రాగానిపల్లె భూముల కుంభకోణంలో ఎవరెవరు ఉన్నారో నిగ్గు తేల్చాలన్నారు.

హిజ్రా లీడర్ హాసిని హత్య

తిరుపతిలో సహచరుల కన్నీటి వీడ్కోలు



తిరుపతి అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో దారుణ హత్యకు గురైన హిజ్రా లీడర్ హాసినికి బుధవారం సాయంత్రం తిరుపతిలో సహచరుల కన్నీటి మధ్య అంత్యక్రియలు జరిగాయి. మంగళవారం రాత్రి హత్యకు గురైన మానకల హాసిని మృతదేహాన్ని మంగళంలోని ఆమె నివాసానికి తీసుకొచ్చారు. వందలాదిగా వేచివున్న హిజ్రాల ఏడుపులతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. 'మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయావా హాసినీ... ఇక మేమెలా బతకాలి హాసినీ... మాకెవరు దిక్కు హాసినీ... మాకందరికి తల్లిలా ఉన్నావు, ఏ కష్టమొచ్చినా ఆదుకునే అక్క వెళ్లిపోయింది' అంటూ కన్నీరుమున్నీరయ్యారు. హాసిని తల్లీ, తోబుట్టువు కూడా వచ్చారు. అనేక ప్రాంతాల నుంచి హిజ్రాలు కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలలో తరలివచ్చారు. అంత్యక్రియలు పూర్తయ్యే దాకా పోలీసులు పటిష్ఠ బందోబస్తు కల్పించారు.

రేపు పురందరదాసు ఆరాధన మహోత్సవం

తిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వాగ్గేయకారుడు, కన్నడ సంగీత పదకవితా పితామహుడు పురందరదాసు ఆరాధన మహోత్సవాన్ని టీటీడీ శుక్రవారం వైభవంగా నిర్వహించనుంది. సహస్రదీపాలంకార సేవ అనంతరం మలయప్పస్వామి, ఉభయ దేవేరులను సాయంత్రం 5.30 గంటలకు తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనానికి వేంచేపు చేస్తారు. సంగీత కళాకారుల బృందగానం ఆలకించిన తర్వాత ఉత్సవమూర్తులు తిరిగి 8 గంటలకు ఆలయానికి చేరుకుంటారు. ఈ మహోత్సవం సందర్భంగా టీటీడీ దాసాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

బావిలో పడ్డ ఆవు



గోతిలో పడ్డ ఆవును వెలికి తీస్తున్న ఎక్స్‌కవేటరు

చౌడేపల్లె, నవంబరు27:(ఆంధ్రజ్యోతి): పాడుబడిన గొట్టపు బావిలో ఓ ఆవు ప్రమాదవశాత్తూ పడిపోయింది. చౌడేపల్లె మండలం అప్పినేపల్లెకు చెందిన చంద్ర బుధవారం తన ఆవులను మేతకోసం తోలుకెళ్లాడు. ఈ క్రమంలో అప్పినేపల్లె నుంచి మిట్టపల్లెకు వెళ్లే మార్గంలో ఒక ఆవు మేత మేస్తూ పాడుబడిన గొట్టపు బావి గుంతలో పడింది. గమనించిన గ్రామస్తులు ఎక్స్‌కవేటరు సాయంతో ఆవును రక్షించారు.

పుంజుకున్న టమోటా ధరలు



సోమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు వారం రోజుల నుంచి పుంజుకున్నాయి. 15కిలోల బాక్సు ధర బుధవారం రూ.650 నుంచి 750 వరకు పలకడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. నెలరోజులుగా 15కిలోల బాక్సు రూ. 300 వరకే పలికింది. అల్పపీడన ప్రభావంతో నెల కిత్రం కురిసిన వర్షాలకు టమోటా తోటలు దెబ్బతిన్నాయి. పంటలకు చీడపీడలు వ్యాపించి పంట నష్టం జరిగింది. ఈ క్రమంలోనే చీడపీడల నివారణకు అధిక పెట్టుబడులు పెట్టవలసి వచ్చింది. ధరలు క్రమంగా పెరగడంతో రైతుల ముఖాల్లో ఆనందం కన్పిస్తోంది.

చల్లాబాబుకు నలుగురు గన్‌మెన్లు



రొంపిచెర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబుకు ప్రభుత్వం నలుగురు గన్‌మెన్లను కేటాయించింది. గన్‌మెన్లు వేలాయుధం, సుందర్‌రాజ, అన్నాదొరై, రమేష్ బుధవారం రొంపిచెర్లలోని చల్లాబాబు ఇంటికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

వన్నెకుల క్షత్రియుల అభివృద్ధికి కృషి


సమావేశమైన సీఆర్.రాజన్, కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజక వర్గంలోని వన్నె కుల క్షత్రియుల అభివృద్ధి, సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్.రాజన్ అన్నారు. కుప్పం మండల టీడీపీ కార్యాల యానికి బుధవారం ఆయన వచ్చారు. ఈ సందర్భం గా ఆయనను స్థానిక టీడీపీ శ్రేణులు సన్మానించాయి. అలాగే కుప్పం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకిర్, మాజీ ఎంపీటీసీ ఉమాపతి తదితరులు సన్మానించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కుప్పం నియోజకవర్గ వన్నెకుల క్షత్రియ అధ్యక్షుడు డి.సతీశ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, మాజీ ఎంపీపీ సాంబశివం, రాష్ట్ర కురబ కుల కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు సతీశ్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

సోమల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం సోమల మార్కెట్ యార్డులో క్లస్టర్, బూత్ కమిటీ ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పంచాయతీలు, బూత్‌ల వారీగా సభ్యత్వ నమోదు వివరాలను వివ రించి టార్గెట్‌లను పూర్తి చేయాల న్నారు. అనంతరం పలు సమస్యల పరిష్కా రంకోసం వచ్చిన కార్యకర్తలను కలసి విన తులు స్వీకరించారు. పలువురు రైతులు ఆయనను కలసి మార్కెట్ యార్డులో ఈ ఏడాది నుంచి టమోటా, మామిడి మండీల ఏర్పాటుకు చర్యలు తీసుకో వాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, మాజీ సర్పంచులు హరిప్రసాద్, సూరిశెట్టి సుధాకర్, వేణుగోపాల్ నాయుడు, శివశంకర్, నాయకులు మహేంద్ర బాబు, సుబ్రమణ్యంయాదవ్, బాలాజీ నాయుడు, రమేశ్‌నాయుడు, సుబ్బరాయుడు, వైవీ సుబ్బయ్యశెట్టి, పి.శ్రీనివాసులు, అష్రఫ్ అలీ, జనార్ధన్, మల్లికార్జున, సతీశ్ పాల్గొన్నారు.

త్వరలోనే బలిజ కమ్యూనిటీ భవనానికి ప్రహరీ


ఎమ్మెల్సీ కంచర్లకు వినతిపత్రం ఇస్తున్న బలిజ నాయకులు

కుప్పం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని బలిజ కమ్యూనిటీ భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి త్వరలోనే చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్‌గా నియమితులైన కంచర్లను బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బలిజ సంఘం తరఫున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు బలిజల సమస్యలు తీర్చాలని ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బలిజ నాయకులు గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, మంజునాథ్, సోము తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి

బైరెడ్డిపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యతగా గుర్తించి ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఆరోగ్య విద్యాధికారి సావిత్రి అన్నారు. బైరెడ్డిపల్లెలో బుధవారం వెలుగు గ్రూపు మహిళలతో సమావేశం నిర్వహించి బాలికావిద్య, పోష కాహార ప్రాముఖ్యత, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమా దేవి వ్యక్తిగత శుభ్రత, మాతాశిశు మరణాల నివారణ, స్వీయరక్షణ తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామసమాఖ్య లీడర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది నిజాయితీ


యజమాన్నిట పర్సును అందజేస్తున్న సిబ్బంది

పలమనేరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): అన్నాక్యాంటీన్ వద్ద పర్సు పోగొట్టుకొన్న వ్యక్తికి తిరిగి పర్సు అప్పగించి మున్సిపల్ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. శ్రీధర్ అనే వ్యక్తి పలమనేరు అన్న క్యాంటీన్ వద్ద బుధవారం పర్సుపోగొట్టుకొన్నాడు. మున్సిపల్ సిబ్బందిలో ఒకరైన రమేష్‌కు ఆ పర్సు దొరికింది. పర్సులోని గుర్తింపు కార్డుల ఆధారంగా శ్రీధర్‌ను గుర్తించి అతడిని పిలిపించారు. పర్సును, అందులోని రూ.5000 నగదు, గుర్తింపు కార్డులను అందజేశారు. దీంతో శ్రీధర్ మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంబీసీ కులాల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శివ తేవర్


నియామకపత్రాలు అందుకుంటున్న శివ తదితరులు

కుప్పం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎంబీసీ (మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్యాస్ట్స్) సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శివతేవర్ నియమి తులయ్యారు. కుప్పంలోనీ బీసీ కార్యాల యంలో బుధవారం సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసల రవి ఆధ్వ ర్యంలో జరిగిన సమావేశంలో కార్యవర్గం ఏర్పడింది. ఎంబీసీ కులాల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శివ తేవర్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడిగా కృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పిరామలై కల్లర్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ తేవర్, జోగి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే సులభంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు టెక్నికల్‌గా నైపుణ్యం పెంపొందించుకుంటే సులభంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మదర్‌థెరిసా కళాశాలలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే మెగా జాబ్‌మేళాను ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటికే పలు ఇంటర్‌నేషనల్ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయన్నారు. ఇందులో చాలావరకు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఇప్పటినుంచే చదువుతోపాటు టెక్నికల్‌గా నైపుణ్యం సాధించి ఉద్యోగాలు సాధించడానికి కృషి చేయాలని సూచించారు. కరస్పాండెంట్ రవీంద్రబాబు మాట్లాడుతూ జాబ్‌మేళాలో 25 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని వివరిం చారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శాంతిపురం మండల సమావేశం

శాంతిపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండల సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, సభ్యులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఉద్యాన పంటలపై అవగాహన సదస్సు

రామకుప్పం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ముద్దనపల్లెలో బుధవారం ఏరిస్ అగ్రో లిమిటెడ్ వారు ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. భూసార పరీక్షలు, సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణ తదితర అంశాలపై సంస్థ డిప్యూటీ డైరెక్టరు జయప్రదీప్‌సుబ్రమణ్యన్ రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని రైతులు అలవర్చుకోవాలని ఆయన కోరారు. సదస్సు అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ జెడ్ఎస్ఎం రత్తయ్య, ఆర్ఎస్ఎం మాధవ్, ఎస్ఎం వేంకటేశ్వరరావు, సుందరరాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోడిగానిపల్లెలో రేపు ప్రజా దర్బార్

కుప్పం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గం, గుడుపల్లె మండలం సోడిగానిపల్లెలో ఈనెల 29వ తేదీన కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు కడా కార్యాలయ వర్గాలు తెలిపాయి. మండలంలోని ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించి పరిష్కారాలు పొందాలని వివరించారు.

బంగారునత్తంలో సిమెంటు రోడ్డుకు భూమిపూజ

కుప్పం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద బంగారునత్తం గ్రామంలో బుధవారం సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తదితరులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో 320 మీటర్ల పొడవున ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

కురబ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



రొంపిచెర్ల, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో బుధవారం జరిగిన కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప ప్రమాణ స్వీకారానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా కురబ కార్పొరేషన్ డైరెక్టర్లు ఉయ్యాల రమణ, వల్లిగట్ల వెంకట్రమణ, సుబ్రమణ్యగౌడు వెళ్లారు. అక్కడ దేవేంద్రప్పను శాలువకప్పి సత్కరించారు. అనంతరం కురబకులస్తుల సమస్యలు ఆయనకు తెలియజేశారు. పరిష్కరించాలని కోరారు.

టీడీపీ నాయకుడి కుమారుడికి అమర్ నివాళి

పలమనేరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని 253 బూత్ కన్వీనర్ చెన్నరాయప్ప కుమారుడు గంగాధర్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం తన సంతాపాన్ని తెలియజేశారు. గంగాధర్ మృతదేహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు.

చౌడేపల్లె ఎస్ఐ బాధ్యతల స్వీకరణ


ఎస్ఐ నాగేశ్వరరావు

చౌడేపల్లె, నవంబరు 27:(ఆంధ్రజ్యోతి) చౌడేపల్లె ఎస్ఐగా నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చౌడేపల్లెలో పనిచేస్తున్న ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కడప జిల్లాకు బదిలీ కావడంతో ఈయన రాజంపేట నుంచి ఇక్కడకు వచ్చారు.

సారా విక్రేత అరెస్ట్

పుంగనూరు రూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): సారా విక్రేతను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండలంలోని ఎంసీపల్లె పంచాయతీ పత్రపల్లెతాండాకు చెందిన చిన్నరెడ్డెప్పనాయక్(41) సారా విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతడి నుంచి సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

సారా ఊట ధ్వంసం

పుంగనూరు రూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్రపల్లెతాండా వ్యవసాయ పొలాల్లో బుధవారం దాడులు నిర్వహించి 1600 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో సీఐ జవహర్‌బాబు, ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపయోగంగా బైరెడ్డిపల్లె ఆర్టీసీ బస్టాండు



అలంకారంగా మారిన బస్టాండు, ఆవరణలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

బైరెడ్డిపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో వున్న ఆర్టీసీ బస్టాండు ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. బస్టాండు నిర్మించి 20 యేళ్లు పైబడినా ఇంతవరకు బస్టాండు ఆవరణలోకి ఒక బస్సు కూడా వచ్చిన సందర్భం లేదు. దీనిగురించి ఆర్టీసీ అధికారులు తగిన శ్రద్ధ తీసుకోకపోవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్టాండు చెత్తమయంగా మారింది. చెత్త పేరుకుపోయి డంపింగ్‌యార్డును తలపిస్తోంది. ఇక బస్టాండు భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కొందరు వాహనాల పార్కింగ్ కోసం మరి కొందరు, రాత్రివేళల్లో మద్యం సేవించడానికి వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండును వినియోగంలోకి తీసుకురావాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రేమజంటకు పెద్దల సమక్షంలో మళ్లీ పెళ్లి



రొంపిచెర్ల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంటకు బుధవారం పెద్దల సమక్షంలో పెళ్లి జరిగింది. భాకరాపేటకు చెందిన ప్రసన్న గానగచింతకు చెందిన రెడ్డెప్ప (21) ప్రేమిం చుకున్నారు. ఈ విషయం తెలిసి అమ్మాయి తల్లిదండ్రులు పెళ్లిసంబంధాలు చూడడం మొదలుపెట్టారు. దీంతో ప్రేమికులు మంగళవారం రొంపిచెర్లలోని ఓ ఆలయంలో పెళ్లిచేసుకోవడం, పెళ్లి కుమార్తె కుటుం బసభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడం, ప్రేమజంట పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే ప్రేమికులు మేజర్లు కావడంతో పోలీసుల సూచన మేరకు పెద్దలు శాంతించాల్సి వచ్చింది. చివరికి గ్రామపెద్దలు ఇరుకుటుంబాల పెద్దలతో చర్చించి బుధవారం ఆలయంలో సంప్రదాయబద్ధంగా ప్రేమికులకు మరోసారి వివాహం జరిపించారు.

ఉనికి చాటుకోవడానికే వైసీపీ విమర్శలు


మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, నవంబరు27(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు తమ ఉనికిని చాటుకోవడానికే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలోని జడ్పీగెస్ట్‌హౌస్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు పరిపాలనను గాడిలో పెట్టడంతో పాటు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో గుంతలు పడిన రోడ్ల పనులు చేయడానికి టెండర్లు పిలిచినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. పట్టణ పరిధిలో మురుగు కాల్వలు, రోడ్ల మరమ్మతు పనులకు సుమారు రూ.70లక్షలతో టెండర్లు పిలిచామని వివరించారు. నియోజకవర్గంలో 36వేల మంది టీడీపీ సభ్యత్వం ఇప్పటికే పొందారని తెలియజేశారు. సభ్యత్వ నమోదును త్వరగా పూర్తి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో నాయకులు మాధవరెడ్డి, సీవీ రెడ్డి, శ్రీకాంత్, పోలీసు గిరి, ఎస్టీ రాష్ట్ర కో-ఆపరేషన్ డైరెక్టర్ కృష్ణానాయక్, సుబ్రహ్మణ్యంరాజు, కవిత, గువ్వల రమేశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గంగాధర్, రెడ్డెప్పయాదవ్, గిరిరాజు, రమణ, సుబ్రహ్మణ్యం, ఐటీడీపీ కుమార్ పాల్గొన్నారు.

సాధారణ కాన్పులు పెంచాలి


మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ నిరంజన్‌కుమార్

పలమనేరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆరోగ్యకార్యకర్తలు, ఆశా వర్కర్లు సమన్వయంతో సాధారణ కాన్పులపై గర్భిణులకు అవగాహన కల్పించాలని స్థానిక మెడికల్ ఆఫీసర్ నిరంజన్‌కుమార్ సూచించారు. పలమనేరు కాకాతోపు అర్బన్ ఆరోగ్యకేంద్రంలో అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు గర్భందాల్చినది మొదలు వారిని క్రమం తప్పకుండా డాక్టరు వద్ద పరీక్షలు చేయించడంతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని తీసుకొనేలా చైతన్య పరచాలని సూచించారు. వైద్యుల సలహాలతో సాధారణ కాన్పుదిశగా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ నజ్మా మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

బాల్య వివాహాలను నిరోధించాలి



మాట్లాడుతున్న ఏపీపీ హరినాథ్‌రెడ్డి

పుంగనూరు రూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిరోధించాలని పుంగనూరు కోర్టు ఏపీపీ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కొత్తయిండ్లు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధతో వినాలని సూచించారు. క్రమశిక్షణతో ఉంటేనే ఉన్నత చదువులు చదివి మంచిస్థాయికి చేరుకోవచ్చని తెలియజేశారు. విద్యహక్కు చట్టం, బాల్యవివాహాలను నిరోధించడం తదితర అంశాలను వివరించారు. ఈ సమావేశంలో న్యాయవాది టి.వి. రమణ, హెచ్ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన వెంకన్న ఆలయ వార్షికోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

సోమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లెలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక ఉత్సవాలు బుధవారం ముగిశాయి. అర్చకులు ఆలయంలోని మూల విరాట్‌కు విశేష అలంకరణలు జరిపి అభిషేకపూజలు జరిపారు. ఈక్రమంలోనే స్వామి వారికి వెండి కిరీటాన్ని వితరణ చేసిన దాతలు గల్లా నాగరత్నమ్మ, సుధాకర్ నాయుడులను, కల్యాణోత్సవ ఉభయ దారులు ముప్పాల నవ్య, హేమాద్రి నాయుడులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు కొల్లా హరిప్రసాద్, జయచంద్ర, పురుషోత్తం, రమేశ్‌నాయుడు, గుర్రప్ప నాయుడు పాల్గొన్నారు.

వరి కోతలను వాయిదా వేసుకోవాలి

పుంగనూరు రూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి కోతను వాయిదా వేసుకోవాలని ఏడీఏ శివకుమార్ రాజు కోరారు. బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మండలంలోని చంద్రమాకులపల్లె, బోడేవారిపల్లె పంచాయతీల్లోని రైతులతో ఆయన మాట్లాడారు. పంటలకు బీమా చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పద్ధతులతో పంటలు పండించి దిగుబడిని పెంచుకోవాలన్నారు. పంట సాగులో సమస్యలను వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ టెక్నికల్ అసిస్టెంట్ పయాజ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల వితరణ


ప్రత్యేకాలంకరణలో సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి పంచలోహ విగ్రహాలు

చౌడేపల్లె, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండులో వెలసిన కమలాంజనేయ స్వామి ఆలయానికి రూ.2.50 లక్షల విలువైన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలను కల్లూరుకు చెందిన భక్తులు విరాళంగా అందజేశారని అర్చకులు వశిష్టాచార్యులు వెల్లడించారు. కల్లూరుకు చెందిన భక్తులు నాగమణి, శ్రీనివాసులు దంపతులు, స్నేహ, యుగంధర్ దంపతులు విగ్రహాలను అందించారని తెలియజేశారు.

కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

గుడుపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం రాళ్లగంగమాంబ ఆలయం కల్యాణ మండపంలో మండల టీడీపీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నాయకులు అందరూ కలిసి కట్టుగా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్క రించి పార్టీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. సభ్యత నమోదులో మండలం వెనుకబడి ఉందని నాయకులు అందరూ గ్రామాల్లో తిరిగి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం మాట్లాడుతూ సభ్యత్వ నమోదు జోరుగా చేయాలన్నారు. టీడీపీ పాలక మండలి సభ్యులు వైద్యం శాంతారాం మాట్లాడుతూ నాయకులు విభేదాలు వీడి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశానికి టీడీపీ మండల అధ్యక్షుడు బాబునాయయుడు, కుప్పం మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, వన్నెకుల క్షత్రియ కమిటీ సభ్యులు అరుణాచలం, హేమాంబర్ గౌడు, బేటప్పనాయుడు, సుబ్రహ్మణ్యం, భాను మూర్తి, ఎస్ఆర్ చంద్ర, గోవిందస్వామి, మంజునాథ్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అపార్ నమోదు వేగవంతం చేయాలి

సోమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పెండింగ్‌లో ఉన్న అపార్ నమోదు పనులు వేగవంతంగా చేసుకోవాలని ఎంఈవో శివరత్న పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సోమల, సూరయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలలో అపార్ ఐడీ వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. నెల్లిమంద సచివాలయంలో అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. హెచ్ఎంలు హరినాథ్, నిరంజన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యదర్శి కుటుంబాన్ని ఆదుకుంటాం


ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

పలమనేరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని 5వ వార్డు కార్యదర్శిగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన జగదీష్ కుటుంబసభ్యులను బుధవారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పరామర్శించారు. జగదీష్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం జగదీష్ కుటుంబసభ్యులకు రూ.30వేల ఆర్థికసాయం అందించారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన పోలీసులకు ఫిర్యాదు

చౌడేపల్లె, నవంబరు27:(ఆంధ్రజ్యోతి): విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన కళాశాల విద్యార్థులపై పోలీసులకు ఉపాధ్యాయులు బుధవారం ఫిర్యాదు చేశారు. స్థానిక హైస్కూల్లో రెండురోజులుగా జోనల్ క్రీడలు జరుగుతున్నాయి. ఈక్రమంలో మంగళవారం ఉపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు క్రీడల నిర్వహణలో నిమగ్నమయ్యారు. బత్తలాపురానికి చెందిన స్థానిక జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతూ డ్రాప్ అవుట్‌లుగా ఉన్న ఇద్దరు మైనర్ విద్యార్థులతో పాటు పదో తరగతి మధ్యలోనే బడి మానేసి మరో విద్యార్థి కలిసి పాఠశాల విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించారు. ఈ విషయాన్ని బాధిత విద్యార్థిని బుధవారం ఉపాధ్యాయులకు తెలియజేసింది.

వృద్ధురాలిపై కుక్కల దాడి


చికిత్స పొందుతున్న జయమ్మ

పుంగనూరు రూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఈ సంఘటన బుధవారం పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కుమ్మరనత్తం పంచాయతీ పిచ్చిగుంట్లపల్లెకు చెందిన చిన్నరామయ్య భార్య జయమ్మ(65) అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం కోసం కపాడమిట్ట పల్లెలోని గ్రామ క్లినిక్‌కు వెళ్లింది. అక్కడ వైద్యం చేయించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా దారిలో కుక్కలు దాడిచేశాయి. ఆమె కేకలు వేయడంతో చుట్టూ పక్కల వారు వచ్చి కుక్కల బారినుంచి ఆమెను రక్షించారు. గాయపడ్డ ఆమెను పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఆర్‌టీఐతో సమాచారం పొందడం సులభతరం


మాట్లాడుతున్న గుణశేఖర్‌రెడ్డి

గంగాధరనెల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్‌టీఐ చట్టం అమలులోకి రావడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవడానికి చాలా సులభమైందని ఎంఈవో-2 గుణశేఖర్ రెడ్డి, మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లోకేష్‌లు అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం సమాచారహక్కు చట్టం సంఘం యూనియన్ వార్షికోత్సవం సందర్భంగా అధికారులు, ఆర్‌టీఐ యూనియన్ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఆర్‌టీఐ యూనియన్ జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి మాట్లాడుతూ ఆర్‌టీఐకి అనుబంధంగా ప్రొటెక్షన్ ఆఫ్ హ్యూమన్‌రైట్స్ ఫోర్స్ స్థాపించారన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఐ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.కె.కుమార్, మోహన్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈ వరదరాజులు, రామరాజ్, లోకనాథం నాయుడు, రాజేష్‌కుమార్, పలువురు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



గంగాధరనెల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యరక్షణే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రాష్ట్రీయ బాల సురక్ష ప్రోగ్రామ్ లక్ష్యమని పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి అన్నారు. స్థానిక హైస్కూల్లో బుధవారం 182మంది విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ వర్షాలకుతోడు చలికాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కాచివడబోసిన నీరు తాగాలని సూచించారు. సీహెచ్‌వో శ్రీనివాసులు, సంధ్య, ఝాన్సీ భారతి, మమత, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వేగంగా పన్ను వివరాలు పొందుపరచండి: డీపీవో


నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న డీపీవో

యాదమరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పరిధిలో పన్ను నమోదు ప్రక్రియను జిల్లా పంచాయతీ అధికారి సుధాకరరావు పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా స్వర్ణ పంచాయతీ వివరాలు నమోదు ప్రక్రియలో యాదగిరి మండలం వెనుకబడిన నేపథ్యంలో బుధవారం ఆయన వరదరాజులపల్లి పంచాయతీ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులు పరిశీలించారు. పన్ను వివరాల నమోదు ప్రక్రియ రెండురోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు టీడీపీ నేతలు లైఫ్‌టైమ్ సభ్యత్వాల స్వీకారం


లైఫ్‌టైమ్ సభ్యత్వం చేస్తున్న హేమాద్రి నాయుడు

శ్రీరంగరాజపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మెదవాడ గ్రామంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు రాజేంద్ర నాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు హేమాద్రి నాయుడు రూ. లక్ష చెల్లించి లైఫ్‌టైమ్ సభ్యత్వానితీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జలంధర్ నాయుడు, మండల ఉపాధ్యాక్షుడు నీరంజన్‌రెడ్డి, మండల ఆర్గనైజేషన్ సెక్రటరీ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ



నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్న వెంకమరాజు

విజయపురం, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): మాధవరం ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు బుధవారం నైపుణ్యతపై శిక్షణ అందించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దొమ్మరాజు వెంకమరాజు విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు విద్యతోపాటు వివిధ అంశాల పట్ల నైపుణ్యం ఉండాలని సూచించారు. పారిశ్రామిక రంగంలో నైపుణ్యత కలిగిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లలితకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాట్సప్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తాం

● కమర్షియల్ ట్యాక్స్ జేసీ జాన్ స్టీవెన్‌సన్



చిత్తూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కమర్షియల్ ట్యాక్స్ జేసీ జాన్ స్టీవెన్‌సన్ తెలిపారు. బుధవారం చిత్తూరులోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందుకు వాట్సప్ నంబరు ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా ఫిర్యాదులను మోనిటర్ చేసేందుకు టీం ఉంటుందన్నారు. వినియోగదారులు ఏమి కొన్నా బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. బిల్లుకు అదనంగా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలన్నారు. వ్యాపారులకు కూడా సకాలంలో పన్నులు చెల్లించాలన్నారు. త్వరలో వాట్సప్ ప్రకటిస్తామని వివరించారు.

ఎమ్మెల్యే మురళీమోహన్‌కు బీజేపీ నేతల సత్కారం



ఐరాల,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో రైతుల సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే మురళిమోహన్‌ను బుధవారం చిత్తూరులోని ఆయన నివాసంలో బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రాజేష్‌రెడ్డి, పెరుమాళ్లసుబ్బారెడ్డి మాట్లాడుతూ నియోజవర్గంలో మామిడి బోర్డు ఏర్పాటు చేసి ధరలను స్థిరీకరించాలకి కోరడం సంతోషకరమన్నారు. సీఎంసీలో ఆరోగ్యశ్రీ వర్తింపచేస్తే పేదలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత హెడ్‌మాస్టర్ సీతాపతినాయుడు, మండల టీడీపీ కన్వీనర్ గిరిధర్‌బాబు, నాయకులు గంగారపు హరిబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

చిత్తూరు కల్చరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి) :గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో గురువారం స్వామివారికి త్రమోదశి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు మహేష్ తెలిపారు. కార్తీక మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారంఏకదిన బిల్వార్చన, శనివారం అఘోర పాసుపతాస్త్ర హోమం, రుద్రాభిషేకం, ప్రత్యేక దీపారాధనలు నిర్వహించనున్నామన్నారు.

రాయితీ డ్రిప్ పరికరాల పంపిణీ

పెనుమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శాతంభాకం రైతుసేవా కేంద్రంలో 10శాతం వాటా డీడీ రూపంలో చెల్లించిన వారికి బిందుసేద్యం పరికరాలను అందించినట్లు వీహెచ్‌ఏ సంధ్య తెలిపారు. బుధవారం రామాపురం, శాతంభాకం, పెద్దరాజుపల్లి గ్రామాల్లో రైతులకు డ్రిప్ పరికరాలను అందిచామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుని డీడీ చెల్లించినవారు కూడా త్వరగా తమ వాటా చెల్లించి పరికరాలను పొందాలన్నారు.

దివ్యాంగులకు వైద్యపరీక్షలు



నగరి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిదిలోని దేశమ్మ దేవాలయం వద్ద సిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు ఏరియా వైద్యశాల సిబ్బంది బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు.నగరి జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. దివ్యాంగులకు సమస్య రాకుండా చూసుకోవాలని పాఠశాల నిర్వాహకులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సిబ్బంది పాఠశాల నిర్వాహకులు, విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం: ముగ్గురి అరెస్టు

శ్రీరంగరాజపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సారా స్వాధీనం చేసుకుని ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు ఎస్‌ఆర్‌పురం మండలం పుల్లూరు క్రాస్ రోడ్డులో పోలీసులు వాహనానలను తనిఖీ చేస్తుండగా, చిన్నతయ్యూరు గ్రామానికి చెందిన పృథ్వీరాజ్, శేషాద్రి, యు.ఎం.పురం గ్రామానికి రామూర్తి ద్విచక్ర వాహనంలో నాటుసారా తరలిస్తుండగా గుర్తించారు. 10లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

విద్యుత్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల పరిష్కారం

చిత్తూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ రోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేకు మూడు ఫిర్యాదులు వచ్చినట్లు ఆశాఖ డీఈ ప్రసాద్ తెలిపారు. ఈ అర్జీల్లో రెండు వెంటనే పరిష్కరించామన్నారు గ్రీవెన్స్ డే అర్జీలను పరిశీలించే సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

బైకు చోరీ కేసులో ఆరునెలల జైలు

చిత్తూరు లీగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మోటర్ సైకిల్ దొంగతనం కేసులో ఓ వ్యక్తికి చిత్తూరు న్యాయస్థానం ఆరు నెలల జైలుశిక్ష విధించింది. ఈ ఏడాది జూలై 12న బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లెకు చెందిన హరినాథరెడ్డికి చెందిన ద్విచక్రవాహనాన్ని ఈశ్వర్ అలియాస్ కోటేశ్వరరావు చోరీ చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో కోటేశ్వరరావుకు న్యాయమూర్తి ఉమాదేవి ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం


మృతిచెందిన కుప్పయ్య

గుడిపాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మసముద్రం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం మేరకు గొల్లమడుగు దళితవాడకు చెందిన కుప్పయ్య (50) మంగళవారం అర్ధరాత్రి బొమ్మసముద్రం వద్ద నడిచివెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వెదురుకుప్పం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మారేపల్లి గ్రామ పంచాయతీ చెత్త సేకరణ కేంద్రం కార్మికుడు కావలి శ్రీనివాసులు(38) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. పచ్చికాపల్లంకు చెందిన సామాజిక కార్యకర్త ప్రసాద్ స్పందించి తనవంతు సాయంగా కుటుంబీకులకు రూ.10వేలు అందజేశారు.

చంద్రబాబును కలసిన థామస్



వెదురుకుప్పం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం జరగనున్న సోదరుడు రామ్మూర్తి నాయుడి కర్మక్రియలకు హాజరయ్యేందుకు సీఎం బుధవారం రాత్రి తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంలో ఆయనను థామస్ కలిశారు.

తల్లిపై దాడి చేసిన తాగుబోతు పోలీసు

చిత్తూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదనే ఆగ్రహంతో తల్లి మీద దాడి చేశాడో తనయుడు. నగరంలోని రోసినగర్‌కు చెందిన శంకర్ పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేసేవాడు. ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ తల్లి వసంతమ్మతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో బుధవారం కూడా ఎప్పటిలా మద్యం కోసం డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో తల్లిపై బలంగా దాడి చేశాడు. . తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయిన వసంతమ్మను ఇరుగుపొరుగువారు వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు తిరుపతి స్విమ్స్‌కు రెఫర్ చేశారు. నిందితుడు శంకర్‌పై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన

బంగారుపాళ్యం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్ల వినియోగంపై స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు మరుగుదొడ్ల వినియోగంపై నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శాంతి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు ముందుకు వెళ్లేదారేదీ?



కాలనీలో కుంటను తలపిస్తున్న రోడ్డు- కాలనీలోని ఓ ఇంటి నుంచి రోడ్డుపైకి ప్రవహిస్తున్న మురుగునీరు

చిత్తూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలో సావిత్రమ్మ కళాశాల ఎదురుగా ఉన్న కాలనీలో రోడ్డు మురుగుకుంటలా మారింది. దోమలకు ఆవాసంగా మారింది. స్థానికులు తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. ఈ ప్రాంతంలో మురుగు కాలువ వ్యవస్థ లేదు. ఇళ్లలోని మురుగునీరు రోడ్డు మీదకు వదిలేస్తున్నారు. ఈ కాలనీ ప్రారంభంలోని వాటర్ సర్వీస్ స్టేషన్ నుంచి వచ్చే నీరు కూడా ఇక్కడే చేరి కుంటలా తయారైంది. రాకపోకలకు అసౌకర్యంగా ఉది. ఇటీవల ఈ ప్రాంతాల్లో ఓ చిన్నారికి విషజ్వరంతో నెలరోజులు బాధపడింది. ●తవణంపల్లె: ఎగువతడకర వద్ద చిత్తూరు-బంగారుపాళ్యం రహదారి మీదకు మురుగునీరు చేరుతోంది. రోడ్డుకు ఇరు వైపులా ఇళ్లు ఉన్నాయి. కాలువ లేకపోవడంతో వాడుక నీరు రోడ్డు మీదకు వదిలేస్తున్నారు. దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్లపై వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది

● మండల సమావేశంలో సర్పంచుల ఆవేదన


సీహెచ్‌సీ డాక్టర్‌తో మాట్లాడుతున్న సర్పంచ్ దూది వెంకటేష్

పెనుమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పెనుమూరు-చిత్తూరు అలాగే నేంద్రగుంట మార్గాల్లో వెళ్లాలంటేనే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని ఆర్‌కేపురం సర్పంచ్ దూది వెంకటేష్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ హేమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వచ్చే సమావేశంలోగా రోడ్డు మరమ్మతులు చేస్తామని అధికారులు ఆర్‌కేపురం సర్పంచ్‌కు హామీ ఇచ్చారు. సర్పంచులు లేవనెత్తిన రోడ్ల సమస్యలకు సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. సీహెచ్‌సీలో డాక్టర్లు అందుబాటులో ఉండాలని డాక్టర్‌ను పలువురు సభ్యులు కోరారు. డాక్టర్ గీతాకుమారి సమాధానమిస్తూ ఆసుపత్రిలో డాక్టర్ల కొరత ఉందన్నారు. ఇదివరకే ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వర్షాల నేపథ్యంలో విష జ్వరాలు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లాలని, ఫాగింగ్ చేయించాలని సర్పంచులు కోరారు. సమావేశంలో జడ్పీటీసీ దొరస్వామి, ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఏపీవో గుణశేఖర్, విద్యుత్ ఏఈలు తులసిప్రసాద్, రమేష్‌బాబు,ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నీవానది కాంక్రీట్ గోడ నిర్మాణానికి సీఎం ఆదేశం

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని నీవానది కాంక్రీట్ గోడ నిర్మాణానికి సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో నది పరివాహక ప్రాంత ప్రజలకు ఊరట లభించనుందన్నారు. ఆక్రమణలు తొలగించి వరద ముంపు లేకుండా నది పొడవునా ఇరువైపులా సుమారు 6 కిలోమీటర్ల మేర సిమెంట్ కాంక్రీట్ వాల్ నిర్మించాలని అసెంబ్లీలో సీఎంను, జలవనరుల శాఖ మంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రాలు సమర్పించామన్నారు. సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. నీవానది పునరుజ్జీవ చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తూ లేఖ రాసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మామిడి బోర్డు ఏర్పాటు చేయండి: ఎమ్మెల్యే మురళి


కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ నియోజకవర్గంలో ప్రత్యేక మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆయన కలిశారు. రైతుల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. సాగు, తాగునీటి సమస్యలపై చర్చించారు. యాదమరి-గుడియాత్తం రోడ్డు మరమ్మతు పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు రవాణా సౌలభ్యం కలుగుతుందన్నారు. మొదటి దశ పనులు వచ్చేనెల 4, 5 తేదీల్లో ప్రారంభిస్తామని కలెక్టర్ సమాధానమిచ్చారు. ఎమ్మెల్యే వెంట పూతలపట్టు, ఐరాల, యాదమరి మండలాల అధ్యక్షులు దొరబాబు చౌదరి, గిరిధర్ బాబు, మొరార్జీ యాదవ్, నాయకులు ఉన్నారు.

జోనల్ స్థాయి పోటీల్లో మంగళంపల్లె విద్యార్థుల ప్రతిభ


డీఈవో నుంచి అవార్డులు అందుకుంటున్న విద్యార్థినులు

బంగారుపాళ్యం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కడపలో డీసీఈబీలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో మండలంలోని మంగళంపల్లె ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. హిమశ్రీ(డిబేట్). హేమ(వ్యాసరచన)లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆ జిల్లా డీఈఓ మీనాక్షి నుంచి విజేతలు బహుమతులను అందుకున్నారు. వీరిని ఎంఈవో నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


మాట్లాడుతున్న మహిళా,శిశు సంక్షేమ అధికారి సబిత

బంగారుపాళ్యం, నవంబరు 27 (ఆంధ్రజోతి) : బాల్యవివాహాలను అరికట్టాలని మహిళా,శిశు సంక్షేమ అధికారి సబిత కోరారు. బుధవారం బంగారుపాళ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్ళు, బాలురకు 21 ఏళ్ళు పూర్తయిన తర్వాతే వివాహం జరిపించాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుపుతుంటే హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 112కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం పోక్సో చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లోహిత్, స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది రామారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గిరిబాబు, వైద్య సిబ్బంది శరత్‌కుమార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయండి


సబ్‌స్టేషన్‌ను పరిశీస్తున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

పూతలపట్టు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని రంగంపేట క్రాస్ వద్ద 33 కేవీ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి బ్రేకర్లకు అమర్చివున్న బ్యాటరీలను తనిఖీ చేశారు. తుపాను నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఏడీఈ శేషాద్రి రెడ్డి, ఏఈ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'మరుగు'న పడిన నిర్మాణ పనులు


అర్ధంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్డి నిర్మాణం

పాలసముద్రం,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ముఖ్య కార్యాలయాల్లో మరుగుదొడ్ల వసతి లేక అర్జీదారులు ఇబ్బంది పడుతున్నారు. రెండేళ్ల క్రితం ప్రజల సౌకర్యార్థం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మరుగుదొడ్లు నిర్మించడానికి గత ప్రభుత్వం రూ.3 లక్షలు మంజూరు చేసింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ గోడలు నిర్మించి స్లాబ్ వేసి పనులను నిలిని వేశారు.ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో పనులు ఆపివేశారని సమాచారం. అయితే ఈ కార్యాలయాలకు వచ్చే ప్రజలు మరుగుదొడ్లు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

దేశభక్తి గీతాల్లో ధనుష్ ప్రతిభ


ధనుష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం లలిత

యాదమరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కడపలో నిర్వహించిన జిల్లాస్థాయి దేశభక్తిగేయాల పోటీల్లో కె.గొల్లపల్లి పాఠశాల విద్యార్థి ప్రతిభ చూపాడు. మంగళవారం జోనల్ స్థాయి విభాగంలో ఉమ్మడి నాలుగు జిల్లాల నుంచి మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థి ధనుష్‌ను ప్రిన్సిపాల్ ఏపీ లలిత అభినందించారు.

సభ్యత్వ నమోదులో వెనుకంజ

చిత్తూరు సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో నగరి నియోజకవర్గం వెనుకంజలో ఉందని నగరికి చెందిన రామానుజం చలపతి ఆరోపించారు. బుధవారం చిత్తూరులో ఆయన మీడియాతో మాట్లాడారు.అధిష్ఠానం మేల్కొని సభ్యత్వ నమోదుపై విచారణ జరిపించాలని కోరారు.

అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన

బంగారుపాళ్యం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని బుధవారం తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. స్థానిక పోలీసు స్టేషన్ పక్కనే ఉన్న స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. సర్వేయర్ సుమలత, వీఆర్వో రామకృష్ణ, సుబ్బయ్యలు పాల్గొన్నారు.

ముగిసిన బాలగురునాథస్వామి కొలువు మహోత్సవం



గుడిపాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వసంతాపురం పంచాయతీ దళవాయిపల్లెలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న అంకాళ పరమేశ్వరి సమేత బాలగురునాథ స్వామి కొలువు మహోత్సవం బుధవారం మంగళహారతితో ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక నుంచి వందలాదిగా తరలివచ్చారు.

ముత్యాలమ్మ గుడిలో చోరీ

వెదురుకుప్పం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం పేట సమీపంలోని ముత్యాలమ్మ గుడిలోని హుండీని దుండగులు చోరీ చేసినట్లు స్థానికులు బుధవారం తెలిపారు.

'ఇంటి స్థలాన్ని ఆక్రమించారు'

చిత్తూరు సిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తమ ఇంటి స్థలాన్ని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించారని పూతలపట్టు మండలం బత్తులవారి పల్లెకు చెందిన కృష్ణయ్య ఆరోపించారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వారసత్వంగా సంక్రమించిన ఇంటి స్థలాన్ని ఆక్రమించి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎంఆర్వోకు, ఎస్పైకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ప్రత్యర్థులు రాజకీయ పలుకుబడితో దౌర్జన్యం చేస్తున్నారన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించినందరు తన సోదరి సుభాషినిపై దౌర్జన్యం చేశారని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

వెదురుకుప్పం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లి, పొనగల్లు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో హేమలత మాట్లాడుతూ రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంటల బీమా ప్రీమియం సకాలంలో చెల్లించాలన్నారు.